సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 9 । జనవరి । 2023



దేవర పోతుపై వీడని ఉత్కంఠ

ఊరిదేవర నేపథ్యంలో ఓ గ్రామస్తులు బంధించిన దున్నపోతు తమదంటూ మరో గ్రామస్తులు వివాదానికి తెరలేపారు. 8లో



టమాట కిలో ధర రూ.10.50

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్టంగా రూ.10.50 పలికింది. మార్కెట్‌కు 1,050 టన్నుల టమాటాలు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
32.2°/ 13.4°

జిల్లాలో ఆదివారం చలి తీవ్రత అధికంగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగాను తగ్గాయి. తూర్పు దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నేడు 'స్పందన'



పుట్టపర్తి టౌన్: కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల స్థాయిలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బసంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు వినతి పత్రంలో ఆధార్, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. కోవిడ్ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించి, సామాజిక దూరం పాటించాలని కోరారు.

రైతులకు ఆఖరు చాన్స్

- 13వ విడత పీఎం కిసాన్‌కు ఈ–కేవైసీ తప్పనిసరి



అనంతపురం అగ్రికల్చర్: పీఎం కిసాన్ కోసం రైతులు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈ–కేవైసీ) చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారులు తెలిపారు. త్వరలో సంక్రాంతి కానుకగా 13వ విడత కింద పీఎం కిసాన్ ద్వారా రూ.2 వేల చొప్పున రైతుల ఖాతాలకు జమ కానుందని పేర్కొన్నారు. ఈ మొత్తం జమ కావాలంటే ప్రతి రైతూ ఈ–కేవైసీ పూర్తి చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. గతేడాది అక్టోబర్‌లో 12వ విడతగా విడుదల చేసిన మొత్తానికి ఈ–కేవైసీ తప్పనిసరి చేయగా.. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆ నిర్ణయాన్ని సడలించి 13వ విడతకు వాయిదా వేశారని గుర్తు చేశారు. అందులో భాగంగా పలు దఫాలుగా గడువు పొడిగిస్తూ అవకాశం కల్పించారన్నారు. ఈ–కేవైసీ లేదంటే ఇక నుంచి ఏటా మూడు విడతల్లో వస్తున్న రూ.6 వేలు పడదు. దీని ప్రభావంతో రాష్ట్రం ఇస్తున్న రూ.7,500 భరోసాకు కూడా భవిష్యత్తులో సాంకేతిక సమస్యలు ఎదురయ్యే పరిస్థితి ఉంటుంది. రైతులు ఇదే ఆఖరు అవకాశంగా భావించి ఈ నెల 15 లోపు ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. 15 తర్వాత వెబ్ పోర్టల్ క్లోజ్ అవుతుందన్నారు. మీ–సేవ లేదా కామన్ సర్వీసు సెంటర్ (సీఎస్సీ), ఆర్బీకే అసిస్టెంట్లను, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదించి వేలిముద్రలతో ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. లేదంటే www.pmkisan. gov.in అనే లింక్‌ను ఉపయోగించి స్వయంగా ఇంటర్‌నెట్ కలిగిన ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో కూడా ఆధార్, ఫోన్ నంబరు ద్వారా వచ్చే రెండు ఓటీపీల ద్వారా చేసుకునే అవకాశం ఉంది.

బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ ఎంపిక


ఆంజనేయులు


లక్ష్మన్న

అనంతపురం: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల బీసీ ఉపాధ్యాయ సంఘం కమిటీలను ఎంపిక చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.బీరప్ప, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం జరిగిన బీసీ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గ సమావేశంలో ఈ ఎంపిక జరిగిందన్నారు. సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా పీవీ శివమూర్తి, ప్రధాన కార్యదర్శిగా సి.కృష్ణప్ప, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా ఎం.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా కె.లక్ష్మన్న ఎంపికయ్యారు.

● సజావుగా గ్రూప్‌–1 ప్రిలిమ్స్

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్‌–1 ప్రిలిమ్స్ పరీక్ష సజావుగా జరిగింది. అనంతపురం నగరం, చుట్టుపక్కల 26 కేంద్రాల్లో రెండు సెషన్లుగా ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 74.75 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 9,926 మందికి గాను ఉదయం 7,406 మంది (74.6 శాతం) అభ్యర్థులు పరీక్షలు రాశారు. 2,520 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 7,375 మంది (74.29 శాతం) హాజరయ్యారు. 2,551 మంది గైర్హాజరయ్యారు. కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ అపరంజిని, ఆర్డీఓ మధుసూదన్, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు జయశ్రీ, భారతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఆర్ట్స్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఎస్పీ ఫక్కీరప్ప, డీఎస్పీ మహబూబ్‌బాషా పర్యవేక్షించారు.


అనంతపురం ఆర్ట్స్ కళాశాల పరీక్ష కేంద్రంలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు


దివ్యాంగుడిని ఎత్తుకుని పరీక్ష హాలులోకి తీసుకెళ్తున్న పోలీసు


పరీక్ష హాలు ప్రాంగణంలోనే టిఫిన్ చేస్తున్న అభ్యర్థి


ప్రశ్నపత్రాలను తీసుకొస్తున్న సిబ్బంది

మహిళలు మహారాణులై

ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు భారతమ్మ. గుడిబండ మండలంలో భాగ్యలక్ష్మి స్వయం సహాయక సంఘం సభ్యురాలు. ఇటీవల ఈమె స్త్రీ నిధి పథకం ద్వారా రూ.75 వేల రుణం తీసుకున్నారు. ఆ డబ్బుతో ఎద్దులు కొనుగోలు చేసి వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. కుటుంబానికి తనవంతు ఆర్థిక చేయూతనిస్తున్నారు.



ఈమె పేరు కె.శశికళ. తలుపుల మండలం ఉబ్బరవాండ్లపల్లిలో విజయలక్ష్మి గ్రామసంఘంలో సభ్యురాలు. ఇటీవల ఈమె స్త్రీ నిధి ద్వారా రూ.లక్ష రుణం తీసుకుంది. నాటుకోళ్ల ఫాం నిర్వహిస్తోంది. మంచి లాభాలు రావడంతో సులభంగా నెల వారీ కంతులు చెల్లిస్తోంది. హాయిగా కుటుంబ జీవనం సాగిస్తోంది.



స్త్రీ నిధి.. ఉపాధి పెన్నిధి

- డ్వాక్రా మహిళలకు విరివిగా రుణాలు
- సొంతూళ్లలోనే హాయిగా జీవనం
- ఆర్థిక భరోసానిస్తున్న ప్రభుత్వం
- సాకారమవుతున్న సాధికారత

సాక్షి, పుట్టపర్తి: పేద మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ నిధి పథకం సత్ఫలితాలిస్తోంది. సర్కారు చేయూతతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో అందుతున్న రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా స్త్రీ నిధి రుణాన్ని పొందవచ్చు. జిల్లాలో ఇప్పటి వరకూ 24,483 మంది రూ.93.72 కోట్ల రుణాలు అందుకున్నారు. గ్రామీణ, గిరిజన, పట్టణ ప్రాంతాలు, మారుమూల పల్లెల్లో ఉన్న డ్వాక్రా మహిళలకు సాంకేతిక, ఎలక్ట్రానిక్ పేమెంట్ విధానంలో 48 గంటల్లో రుణం అందించడం స్త్రీ నిధి పథకం ప్రత్యేకత.

దళారులకు చోటేలేదు..

స్త్రీనిధి పథకం ద్వారా మహిళా సంఘాల్లో ఉన్న సభ్యుల జీవనోపాధి కార్యక్రమాలకు కావాల్సిన రుణాలతో పాటు వ్యక్తిగత అవసరాలకు కూడా రుణం అందిస్తారు. ప్రాధాన్యం ఆధారంగా రూ.10 వేల నుంచి గరిష్టంగా రూ.లక్ష వరకు అందిస్తారు. స్వయం సహాయక సంఘానికైతే రూ.2.50 లక్షలు అందుతుంది. రుణం తీసుకోవడం, పొదుపు చేయడం, బీమా సౌకర్యం కల్పించడం, నగదు బదిలీ వంటి సేవలను అందుకోవచ్చు. రుణం తీసుకున్న తరువాత రీపేమెంట్ వివరాలన్నింటినీ ఫోన్ ద్వారానే తెలియజేస్తారు. ఈ ప్రక్రియలో దళారులకు చోటు ఉండదు. కోరిన రుణం మొత్తం నేరుగా బ్యాంకు ద్వారా చేతికే అందుతుండడంతో కమీషన్ల బాధ తప్పుతోంది.

అప్పల బాధ తప్పింది



స్త్రీ నిధి పథకం కింద రూ.75 వేల రుణం తీసుకున్నా. కిరాణా దుకాణం నిర్వహిస్తున్నా. బయట అప్పులు చేసే పని లేకుండా సంఘం ద్వారా డబ్బు తీసుకుని నెల కంతుల ప్రకారం తిరిగి చెల్లిస్తున్నా. మహిళల జీవనోపాధికి స్త్రీ నిధి చక్కటి పథకం.
– రంగమ్మ, నిమ్మలకుంట, ధర్మవరం

ఇబ్బంది లేదు



వేంకటేశ్వర స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నా. దీంతో స్త్రీ నిధి నుంచి రుణం పొందే అవకాశం వచ్చింది. రూ.లక్ష తీసుకుని గ్రామంలో హోటల్ నిర్వహిస్తున్నా. ఎలాంటి ఇబ్బంది లేకుండా కుటుంబాన్ని పోషించుకుంటున్నా.
– నిర్మలమ్మ, ఓడీ చెరువు

ఫ్యాన్సీ స్టోర్ పెట్టుకున్నా



ఇటీవలే స్త్రీ నిధి పథకం కింద రూ.75 వేల రుణం తీసుకున్నా. వచ్చిన డబ్బుతో ఫ్యాన్సీ స్టోర్ నడుపుతున్నా. గతంలో రుణం పొందేందుకు చాలా అవస్థలు పడేవాళ్లం. ఇప్పుడు ఎవరి ప్రమేయం లేకుండా డబ్బు అందింది. ప్రభుత్వ చేయూత మరువలేనిది. – నవనీత, సీకేపల్లి

దళారులను నమ్మొద్దు



మహిళా సంఘాలకు స్త్రీ నిధి రుణాల ద్వారా చాలా ప్రయోజనాలు ఉన్నాయి. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దళారులను ఎవరూ నమ్మవద్దు. అధికారులు ఎక్కడైనా తప్పు చేసినట్లు మా దృష్టికి వస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.
– నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

ఐకమత్యం పెంపు



మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్త్రీ నిధి పథకం అవకాశం కల్పిస్తోంది. సొంతంగా జీవనోపాధితో పాటు సమాజంలో సంఘంగా ఏర్పడి ఐకమత్యం చాటవచ్చు. పురుషులతో సమానంగా మహిళలు రాణించేందుకు చక్కటి అవకాశం.
– కామాక్షయ్య, ఏజీఎం, స్త్రీ నిధి పథకం

షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక


జిల్లా షూటింగ్‌బాల్ జట్టుతో పీడీలు, నాయకులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మోడల్‌స్కూల్ క్రీడా మైదానంలో శనివారం అండర్–18 జిల్లా షూటింగ్ బాల్ జట్టును ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున హాజరైన క్రీడాకారులను పలు జట్లుగా విభజించి పోటీలు నిర్వహించినట్లు షూటింగ్‌బాల్ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. ప్రతిభ కనబరచిన రుద్రాక్స్, జహీర్‌ఖాన్, గౌతంనాయక్, గణేష్‌నాయక్, సతీష్, సాయీశ్వర్, పవన్, లతీఫ్, సాయి చరణ్, అశ్రఫ్, సుశాంత్, బాలకార్తీక్, జశ్వంత్, రఘు, మంజును జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ జట్టు ఈనెల 14న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి శాప్ లీగ్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపాన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, పీడీలు అజీంబాష, రామమోహన్, రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లిరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్లు..


ఎంపికైన క్రీడాకారులు

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం గురుకుల పాఠశాలలో ఆదివారం హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హ్యాండ్‌బాల్ అండర్ –15, 19 జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈ నెల 13,14 తేదీల్లో గన్నవరంలో జరిగే 44వ రాష్ట్రస్థాయి బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ బలరామిరెడ్డి, కార్యదర్శి ముస్తఫా కమాల్‌బాషా, ప్రిన్సిపాల్ దాదాపీర్, పీడీ ఉగాదినాయక్ తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ పరీక్షలో మెరిసిన కదిరి విద్యార్థి


సనత్‌కుమార్‌రెడ్డి

కదిరి: యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్షలో కదిరి విద్యార్థి ఎం. సనత్‌కుమార్‌రెడ్డి సత్తా చాటారు. రెండు రోజుల క్రితం విడుదలైన ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 18వ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీలో నేషనల్ హైవేస్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. యూపీఎస్సీలో మంచి ర్యాంకు సాధించడంతో మినిస్ట్రీ ఆఫ్ రోడ్స్ శాఖలో కీలక పోస్టు దక్కనుంది. సనత్‌కుమార్‌రెడ్డి తండ్రి నాగ బయారెడ్డి కదిరి పట్టణంలోని జీవిమాను సర్కిల్‌లో మహేశ్వరి సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ దుకాణం నిర్వహిస్తున్నారు. తల్లి నిర్మలమ్మ గృహిణి. 10వ తరగతి వరకూ కర్నూలు జిల్లా పాణ్యం కేశవరెడ్డి రెసిడెన్సీ స్కూల్‌లో, ఇంటర్ హైదరాబాద్‌లోని నల్లకుంట నారాయణ కళాశాల, బీటెక్ కర్ణాటకలోని సూరత్‌కల్‌లో ఎన్ఐటీకేలో పూర్తి చేశారు. హైదరాబాద్‌లో ఐఐటీ ఎంటెక్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ కోర్సు చదివారు. పేద ప్రజలకు సేవలందించాలనేది తన లక్ష్యమని సనత్‌కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా 'సాక్షి'కి తెలియజేశారు. కుమారుడికి యూపీఎస్సీలో మంచి ర్యాంకు రావడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

అనంతపురం: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధన, విద్యార్థుల అభ్యసనాన్ని పటిష్టం చేయడమే లక్ష్యంగా విద్యాశాఖ 'అనంత సంకల్పం' పేరిట 100 రోజుల కార్యక్రమం రూపొందించింది. ఈ నెల 16 నుంచి ఏప్రిల్ రెండో తేదీ వరకు మొత్తం 8 రౌండ్లలో రోజువారీ టైం టేబుల్‌కు అవరోధం లేకుండా ఉదయం, సాయంత్రం, సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక నిపుణులతో రూపొందించిన స్టడీ మెటీరియల్ అందించాలని ఆర్జేడీ ఎం.వెంకటకృష్ణారెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి పాఠశాలకు మూడు సెట్ల చొప్పున ప్రత్యేక స్టడీ మెటీరియల్ అందజేయనున్నారు. ఈ నెల 18లోపు విద్యార్థులకు అందించే స్టడీ మెటీరియల్‌ను ఆయా పాఠశాలలకు చేర్చాలని నిర్ణయం తీసుకున్నారు. విద్యాశాఖ తరఫున తొలిసారిగా స్టడీ మెటీరియల్ అందిస్తుండడం గమనార్హం. ఇప్పటికే అనంత సంకల్పం కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ పూర్తిచేసినట్లు ఆర్జేడీ తెలిపారు.

పసిడి తక్కువకేనంటూ బురిడీ

- కిరాణా వ్యాపారికి రూ. 15 లక్షల టోకరా
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: తక్కువకే బంగారం అని చెబితే అత్యాశకు పోయిన వ్యాపారి నిలువునా మోసపోయాడు. రూ.15 లక్షలు నగదు తీసుకుని నకిలీ బంగారం అంటగట్టి అగంతకుడు పరారయ్యాడు. ఈ ఘటన అనంతపురంలో జరిగింది. వివరాలను వన్‌టౌన్ సీఐ రవిశంకర్‌రెడ్డి ఆదివారం సాయంత్రం మీడియాకు వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి పోలీసు స్టేషన్ సమీపాన నివాసం ఉంటున్న చంద్రశేఖర్ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. పది రోజుల క్రితం చంద్రశేఖర్‌కు ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. తనకు బంగారం దొరికిందని, తక్కువ ధరకు అమ్మాలనుకుంటున్నానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆలోచనలో పడ్డ కిరాణా వ్యాపారి తనే ఆ బంగారం కొనాలనుకున్నాడు. వెంటనే ఆ అపరిచిత వ్యక్తికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. బంగారం చూసిన తర్వాత ఒప్పందం చేసుకుందామని చెప్పగా.. అపరిచితుడు అనంతపురం రమ్మన్నాడు. కదిరికే రమ్మని వ్యాపారి కోరితే.. అంత డబ్బు తీసుకెళ్లడం తనకు కష్టమవుతుందని చెప్పాడు. చేసేదిలేక శనివారం సాయంత్రం అనంతపురం చేరుకున్న చంద్రశేఖర్‌కు బంగారం ముక్క అందజేశాడు. దానిని స్వర్ణకారుని వద్ద చూపించగా నాణ్యమైనదేనని ధ్రువీకరించారు. బంగారం ముద్దకు రూ.15లక్షలు బేరం కుదిరింది. అదే రోజు రాత్రి శ్రీకంఠం సర్కిల్ వద్దనున్న ఓ లాడ్జి వద్ద డబ్బు.. బంగారం ముద్దను మార్చుకుని ఎవరికి వారు వెళ్లిపోయారు. ఆదివారం ఉదయానికి బంగారు ముద్ద రంగు మారడాన్ని వ్యాపారి గమనించి.. మరోసారి టెస్టింగ్ చేయించగా.. నకిలీ అని తేలింది. దీంతో బాధితుడు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కెళ్లి ఫిర్యాదు చేశాడు. బాధితుడికి ఫోన్ చేసిన వారు ఉత్తరప్రదేశ్‌కు చెందినవారుగా పోలీసులు భావిస్తున్నారు.

క్లుప్తంగా

ప్రమాదంలో గాయపడిన జేఎన్‌టీయూ విద్యార్థులు

గుత్తి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందప డిన ఘటనలో ఇంజినీరింగ్ విద్యార్థులు గాయప డ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపు రంలోని జేఎన్‌టీయూ (ఏ)కు చెందిన విద్యార్థులు విఘ్నేష్, షాహీర్ ఆదివారం గుత్తి కోట సందర్శనకు ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. గుత్తి శివారులోని ఎస్కేడీ ఇంజినీరింగ్ కళాశాల వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రిం చుకోలేక అదుపు తప్పి కిందపడ్డారు. ఘటనలో విఘ్నేష్, షాహీర్ తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు గమనించి, క్షతగాత్రు లను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఐసీడీఎస్, సీడీబ్ల్యూసీ అధికారులు

అనంతపురం సెంట్రల్: కోల్‌కత్తాలోని దోజీపూర్ జిల్లాకు చెందిన పంద్రెండేళ్ల బాలికను తల్లిదం డ్రులకు ఆదివారం ఐసీడీఎస్, సీడబ్ల్యూసీ అధికా రులు అప్పగించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి మాట్లాడుతూ.. ఇటీవల తన తల్లితో కలసి బెంగుళూరుకు వచ్చిన ప్రీతిరాయ్ పది రోజుల క్రితం తప్పిపోయింది. రెండురోజుల క్రితం అనంతపురం రైల్వే స్టేషన్‌లో తచ్చాడు తుండగా చైల్డ్‌లైన్ 1098 సిబ్బంది గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచినట్లు గుర్తు చేశారు. దీంతో బాలికను బుడ్డప్పనగర్‌లోని బాలసదనంలో ఆశ్రయం కల్పించి, విషయాన్ని తల్లిదండ్రులకు చేరవేసినట్లు గుర్తు చేశారు. దీం తో ఆదివారం బాలసదనానికి చేరుకున్న తల్లిదం డ్రులకు బాలికను అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు ఓబులపతి, చైల్డ్‌లైన్ 1098 కో ఆర్డినేటర్ కృష్ణమాచారి, బాల సదనం సూపరింటెండెంట్ సరస్వతి, ఐసీపీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



బత్తలపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెం దినట్లు ఎస్‌ఐ టీపీ శ్రీహర్ష తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలోని కట్టకిందపల్లి సబ్ స్టేషన్ వద్ద అనారోగ్యంతో బాధపడు తున్న గుర్తు తెలియని వ్యక్తిని అక్కడి సిబ్బంది చొరవ తీసుకుని గత ఏడాది డిసెంబర్ 5న 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పం దించక ఈ నెల 4న అతను మృతి చెందాడు. ప్రస్తుతం అతని మృతదేహం సర్వజనాస్ప త్రిలోని మార్చురీలో ఉంచారు. ఆచూకీ తెలి సిన వారు సంప్రదించాలని, లేకుండా అనాథ మృతదేహంగా గుర్తించి అంత్యక్రియలు నిర్వ హిస్తారని పేర్కొన్నారు.

దేవర పోతుపై వీడని ఉత్కంఠ

ఉండేది ఒకేఒక్క దేవర దున్నపోతు.. రోజుల వ్యవధిలో రెండు గ్రామాల్లో దేవర (జాతర) ఉంది. దేవరపోతు లేకుంటే జాతరే జరగదు. ఊరి దేవర చేయకపోతే గ్రామానికి అరిష్టమని అందరూ భావిస్తున్నారు. దీంతో ఉన్న ఒక్క దేవర పోతును వదులుకునేందుకు రెండు గ్రామాల ప్రజలు ఇష్ట పడడం లేదు. దీంతో ఆ దున్నపోతు తమదంటే.. తమ దంటూ గ్రామస్తుల మధ్య వివాదం నెలకొంది. ఈ అంశాన్ని రెండు గ్రామాల పెద్దలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఉత్కంఠ నెలకొంది. – కణేకల్లు:



అంబాపురం వద్ద ఉన్న దేవరపోతు

- మాదంటే... మాదంటున్న రచ్చుమర్రి, అంబాపురం గ్రామస్తులు
- అంబాపురంలో ఈ నెల 17న జాతర
- రెండు నెలల్లోపు రచ్చుమర్రిలో దేవర
- వదులుకునేందుకు సిద్ధంగా లేని ఇరుగ్రామాల ప్రజలు

కణేకల్లు మండలానికి పడమట అంబాపురం, ఉత్త రాన రచ్చుమర్రి గ్రామాలున్నాయి. పదేళ్లకోసారి ఊరి దేవర జరపడం ఈ రెండు గ్రామాల్లో ఆనవా యితీగా వస్తోంది. ఊరి దేవర జరిగిన నెల తర్వాత అమ్మవారి పేరున ఓ మూడు నెలల వయసున్న దున్నపోతును కొనుగోలు చేసి వదులుతుంటారు. ఈ క్రమంలో పదేళ్ల క్రితం ఈ రెండు గ్రామాల్లోనూ ఊరి దేవర ముగిసిన తర్వాత మళ్లీ దున్నపోతును అమ్మవారి పేరున వదిలేశారు. ప్రస్తుతం ఈ రెండు గ్రామాల్లో ఊరి దేవరకు గ్రామస్తులు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు.

పట్టుదలకు పోయిన గ్రామ పెద్దలు

ఈ నెల 17న అంబాపురంలో, మరో రెండు నెల ల్లోపు రచ్చుమర్రిలో ఊరి దేవర నిర్వహించాలని గ్రామ పెద్దలు నిశ్చయించారు. ఈ క్రమంలో తాము అమ్మవారి పేరుతో వదిలిన దేవర దున్న పోతు కోసం అంబాపురం గ్రామస్తులు నెల రోజు లుగా వివిధ ప్రాంతాల్లో గాలించి, చివరకు బొమ్మ నహాళ్ మండలం కొలగానహళ్లిలో కనిపించిన దున్నపోతును తీసుకెళ్లి గ్రామంలోని బందులదొ డ్డిలో బంధించారు. విషయం తెలుసుకున్న ఉద్దే హాళ్ గ్రామస్తులు అంబాపురానికి చేరుకుని బందు లదొడ్డిలో ఉంచిన దున్నపోతును గమనించి, అది తమదని వాదనకు దిగారు. అయితే ఆ పోతు తమ దేనంటూ అంబాపురం వాసులు నచ్చచెప్పడంతో వారు వెనుదిరిగారు. ఈ సమస్య సద్దుమణిగింద నుకుంటున్న తరుణంలో రచ్చుమర్రి గ్రామస్తు లొచ్చి పోతు తమదేనంటూ భీష్మించారు. తాము వదిలిన దున్నపోతును ఎలా బంధిస్తారంటూ అం బాపురం గ్రామ పెద్దలను నిలదీశారు. వారం రోజు లుగా ఇరు గ్రామాల మధ్య ఈ వివాదం చెలరే గుతూ వస్తోంది. ఇరు గ్రామాల పెద్దలు పట్టుద లకు పోయి విశ్వ ప్రయత్నాలు చేస్తుండడంతో పలు మార్లు పంచాయితీలూ జరిగాయి. ఎవరూ రాజీ పడలేదు. ఊరి దేవరకు తేదీ నిశ్చయించుకున్నామ ని, ఊరంతా సంబరాలకు సిద్ధమైన తరుణంలో ఇలా ఘర్షనకు దిగడం సరికాదంటూ అంబాపురం వాసులు అంటున్నారు. అయితే ఈ పోతును వదులుకుంటే రెండు నెలల్లోపు తమ గ్రామంలో ఊరి దేవర ఎలా జరుపుకోవాలంటూ రచ్చుమర్రి వాసులు నిలదీస్తున్నారు. దీంతో పోతును వదులు కునేందుకు ఇరు గ్రామస్తులూ సిద్ధంగా లేకపోవ డంతో వివాదం మరింత ముదిరింది.

స్టేషన్‌కు చేరినా తెగని పంచాయితీ

చివరకు దేవర పోతు సమస్య కణేకల్లు పోలీస్ స్టేష న్‌కు చేరుకుంది. రెండు గ్రామాల పెద్దల మధ్య సఖ్యత కుదిర్చేందుకు పోలీసులు చేసిన ప్రయ త్నాలు విఫలమయ్యాయి. ఆ పోతు తమదంటే తమదంటూ స్టేషన్‌లోనే రెండు గ్రామాల ప్రజలు మొండిగా వాదనకు దిగారు. దీంతో పోలీసుల పరిస్థితి 'వదలమంటే పాముకు కోపం.. కరవమం టే కప్పకు కోపం' అన్న చందంగా మారింది. పోతును సాధించుకునే వరకూ తగ్గేదేలేదంటూ రెండు గ్రామాల ప్రజలు భీష్మించుకోవడంతో ఎవ రికీ సర్ది చెప్పలేక పోలీసు అధికారులు తలలు పట్టు కున్నారు. పోతు కోసం తాము ఎందాకైనా పోతా మంటూ ఒకరిపై మరొకరు సవాల్ విసురుకుంటు న్నారు. మరికొన్ని రోజుల వ్యవధిలో రెండు గ్రామాల్లో ఊరిదేవర జరుగనున్న నేపథ్యంలో ఈ సమస్యకు పరిష్కారం ఏమిటనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు బాబు

హిందూపురం టౌన్: రైలు ఢీకొనడంతో పట్టాలు దాటుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృ తి చెందాడు. రైల్వే ఎస్‌ఐ బాలాజీ నాయక్ తెలిపిన మేర కు.. హిందూపురం మండలం బీరేపల్లికి చెందిన బాబు(46).. ఆదివారం ఉదయం కొట్నూరు ఇందిరమ్మ కాలనీ సమీపంలో రైలు పట్టాలు దాటేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో అటుగా వస్తున్న రైలును గమనిం చక పట్టాలు మీదకు చేరుకున్న అతన్ని ఇంజన్ ఢీకొంది. ఘటనలతో తీవ్రంగా గాయపడిన బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘట నపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫుట్‌బాల్ కప్ రన్నర్స్‌గా 'అనంత'

అనంతపురం సప్తగిరి సర్కిల్: అండర్–16 ఇన్ స్పైర్ ఫుట్‌బాల్ కప్ విజేతగా గోవాకు చెందిన కంపాషన్ జట్టు నిలిచింది. రన్నరప్‌ను అనం తపురం స్పోర్ట్స్ అకాడమీ జట్టు దక్కించుకుంది. ఆదివారం అనంత క్రీడాగ్రామం వేదికగా జరి గిన ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై 2–1 గోల్స్ తేడాతో గోవా జట్టు విజయం సాధించింది. విజేతలను అభినందిస్తూ ట్రోఫీలను భారత మహిళల అండర్–20 ఫుట్ బాల్ కోచ్ మైనుల్ రాకీ ప్రదానం చేశారు. ఆర్డీటీ ఫైనాన్స్ డైరెక్టర్ సంజు సంగ్వాన్, స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఫుట్‌బాల్ కో–ఆర్డినేటర్ దాదాఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

రాయదుర్గం రూరల్: ప్రయాణికులతో వెళు తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో పలు వురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేర కు... కర్ణాటకలోని కొప్పల్ జిల్లా గంగావతికి చెందిన ఓ కుటుంబం సొంత ఆటోలో గ్రామ గ్రామాలు తిరుగుతూ కొలిమి పనులతో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో కళ్యాణ దుర్గం నుంచి రాయదుర్గానికి ఆదివారం ఆటోలో వస్తుండగా రాయదుర్గం మండలం కదరంపల్లి టోల్‌గేట్ వద్ద కర్ణాటకలోని మొలకా ల్మూరు నుంచి కళ్యాణదుర్గం వైపు ఇటుకల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఢీకొంది. ఆటో ముందు భాగం పూర్తిగా దెబ్బతిని, గంగావతికి చెందిన హనుమంతప్ప, శాంతి , ఈష, నాగరత్న, వీరేష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన వైద్యం కోసం వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుల్లో హనుమం తప్ప పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పరారయ్యాడు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వాటర్ ప్లాంట్ల ఏర్పాటు శుభపరిణామం

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి.



వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, వైఎస్ భాస్కరరెడ్డి

తలుపుల: గ్రామీణులకు అందు బాటులో ప్యూరి ఫైడ్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయడం శుభప రిణామమని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, పులివెందుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ భాస్కరరెడ్డి అన్నారు. మండలంలోని పులి గుండ్లపల్లిలో డా.వైఎస్సార్ మెమోరియల్ వాటర్ ప్లాంట్, రాజనాలవాండ్లపల్లిలో డా.ఈసీ గంగిరెడ్డి మెమోరియల్ వాటర్ ప్లాంట్‌ను ప్రముఖ దంత వైద్య నిపుణుడు డాక్టర్ ఆర్.శ్రీధర్‌రెడ్డి ఏర్పాటు చేయించారు. వీటిని ఆదివారం వారు ప్రారంభిం చి, మాట్లాడారు. ప్లాంట్ల నిర్వహణ ఖర్చుకు గాను కేవలం నామమాత్రపు రుసుం వసూలు చేయడం పై హర్షం వ్యక్తం చేశారు. రెండు గ్రామాల్లో సుమారు మూడు వందల కుటుంబాలకు ప్యూరిఫైడ్ నీటిని అందిస్తున్న డాక్టర్ శ్రీధర్‌రెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి, ఎం పీపీ రఫీనాయక్, సర్పంచ్ సుగుణమ్మ, సీనియర్ నాయకులు జయచంద్రారెడ్డి, లోకనాథరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బెస్తలు రాజకీయంగా ఎదగాలి



మాట్లాడుతున్న బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

పుట్టపర్తి టౌన్: బెస్తలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి తగిన కార్యాచరణ రూపొందించాలని బెస్త సేవా సంఘం జిల్లా అధ్య క్షుడు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. పుట్టపర్తి సమీ పంలోని కర్ణాటకనాగేపల్లి వద్ద ఆదివారం జరిగిన జిల్లా బెస్త సేవా సంఘం విస్తృత స్థాయి సమావేశం లో ఆయన మాట్లాడారు. బెస్తలను ఓటు బ్యాం కుగానే అన్ని రాజకీయపార్టీలు వినియోగించుకుం టున్నాయన్నారు. ఐక్యతతోనే రాజ్యాధికారం సాధిం చవచ్చునన్నారు. గ్రామ స్థాయి నుంచి బెస్తలను చైతన్య పరుస్తూ సంఘం బలోపేతానికి కృషి చేయా లన్నారు. త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాయల సీమ నుంచి బెస్తలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆప్కాప్ చైర్మన్‌గా బెస్తలను నియమించాలని, మత్స్యకార సహకార సంఘంలో బెస్తలకు చోటు కలి ్పంచాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవా ధ్యక్షుడిగా బయన్న, గౌరవ సలహాదారులుగా చలపతి, సుధారాజేష్, అధ్యక్షుడిగా జైసాయి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జ్యోతి ప్రసాద్, ట్రెజరర్‌గా కృష్ణమూర్తి, కార్యదర్శులుగా కేశవ, రవితోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల



మాట్లాడుతున్న మంజుల

కొత్తచెరువు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు అధ్యక్షతన ఆదివారం జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. సీపీ ఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకా యిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు వెంటనే చెల్లించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను కొనసాగించాలని, రోజువారీ పాఠ శాల విధుల్లో భాగంగా యాప్‌లో హాజరు అప్‌లోడ్ చేయడాన్ని తొలగించాలని, ఉపాధ్యాయుల బోధ నకు ఆటంకం కలిగిస్తున్న అన్ని రకాల బోధనేతర విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. సమా వేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్ కుమార్, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ ముత్యాలప్ప, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, త్రిమూ ర్తి, గౌరవ అధ్యక్షుడు మాధవ, జిల్లా సబ్ కమిటీ సభ్యులు రవీంద్రారెడ్డి, చంద్ర, జనార్ధన్, అంజన మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రిష్టిపాడులో కల్తీ జొన్నల తయారీ

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడులో కల్తీ జొన్నల తయారీ గుట్టుగా సాగుతోంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రం వ్యాప్తంగా పచ్చజొన్నలకు భారీ డిమాండ్ ఉండడంతో క్రిష్టిపాడు నివాసి వెంక టేష్‌తో కలసి శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెం దిన బాలు, బాలాజీ, వెంకటేష్, శ్రీనివాసులు అక్ర మాలకు తెరలేపారు. తెల్ల జొన్నలకు పేడ రంగు అద్ది ఆరబెట్టిన తర్వాత ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఏడా దిగా ఈ తంతు సాగుతున్నట్లు సమాచారం.



పేడ రంగు కలిపి తెల్ల జొన్నల రంగు మార్చిన దృశ్యం

ఖాతాదారుల సొమ్ము స్వాహా

- వెలుగులోకి బీపీఎం అక్రమాలు



గొటుకూరులోని పోస్టాఫీస్

కూడేరు: ఖాతాదారులు పొదుపు చేసుకున్న సొమ్మును వారికి తెలయకుండానే బ్రాంచ్ పోస్టుమా స్టర్ స్వాహా చేశాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు అధికారులు విచారణకు సిద్ధమయ్యారు. వివరాలు.. కూడేరు మం డలం గొటుకూరు బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా పనిచే స్తున్న పవన్‌కుమార్.. నిరక్షరాస్యులు, వృద్ధుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారి ఖాతాల్లో నుంచి రూ. లక్షల్లో సొమ్ము స్వాహా చేసినట్లు ఆరోప ణలు వెల్లువెత్తాయి. ఖాతాదారులు చెల్లించిన నగ దును రిజిస్టర్‌లో నమోదు చేయకుండా మోసం చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో ఇటీవల ఖాతాదారు పురు షోత్తం రెడ్డి తన ఖాతాలో ఎంత మేర డబ్బు ఉందనే విషయాన్ని ఆరా తీయడంతో రూ.80 ఉన్నట్లుగా పోస్టుమాస్టర్ తెలిపాడు. అయితే తన వద్ద ఉన్న పాసు పుస్తకంలో రూ.1.75 లక్షలు ఉన్నట్లుగా తెలుస్తోందని నిలదీయడంతో అసలు విషయం వెలుగు చూసింది. దీంతో బీపీఎం పవన్‌కుమార్ కాళ్లబేరానికి వచ్చి స్వాహా చేసిన సొమ్మును త్వరలో వెనక్కు చెల్లిస్తానని నమ్మబలికాడు. దీంతో మిగిలిన ఖాతాదారుల్లో ఆం దోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే మరో ఖాతాదారు పెద్దక్క మూడేళ్లుగా తాను రూ.1.5లక్షలు పొదుపు చేసుకున్నానని, అయితే ఇందుకు సంబంధిం చి తన పాసుబుక్కును బీపీఎం ఇవ్వకుండా వేధిస్తు న్నాడని, ఖాతాలో ఎంత మేర సొమ్ము ఉందనే విష యాన్ని సైతం చెప్పడం లేదని వాపోయింది. ఈ అక్ర మాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధి తులు తెలిపారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చొరవ



సమావేశంలో పాల్గొన్న ముస్లిం ప్రముఖులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు చొరవ చూపుతామని ఐక్య ముత వల్లి, మసీదు కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. స్థానిక ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో రాయలసీమ స్థాయి మసీదు ముతవల్లి, మసీదు కమిటీ సభ్యుల సమావే శాన్ని ఆదివారం నిర్వహించారు. ముతవల్లిలు, ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. వక్ఫ్‌బోర్డు ఆస్తుల రక్షణ దిశగా ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమానికి తమ వం తు పూర్తి సహకారాన్ని అందిస్తా మన్నారు. అన్యాక్రాంతమైన ఆస్తుల స్వాధీనానికి సత్వర చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. ముస్లింల అభ్యున్నతికి వక్ఫ్ బోర్డు ఆస్తులే కీలకమన్నారు. కార్యక్రమంలో షఫీవుల్లా, షకీల్‌షఫి, పెనుగొం డ దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా, కదిరి పీఠాధిపతి ఉబేదుల్లా హుస్సేని, కణేకల్లు ముర్షద్‌పీర్ ఖాద్రి, కడప అర్షద్ సాహెబ్, నంద్యాల హారూన్‌బాషా సాహెబ్, కర్నూలు దాదా బాషా, ప్రభుత్వ ఖ్వాజీలు హారూన్ రషీద్, చాందిని మసీదు మునీర్‌బాషా, రఫి, గుత్తి షఫి తదితరులు పాల్గొ న్నారు.

మా బిడ్డను కాపాడండయ్యా!

కొడుకు పుడితే వృద్ధాప్యంలో అండగా ఉంటాడని ఎవరైనా అను కుంటారు. కానీ పుట్టిన కొడుకు కొన్నేళ్లకే భరించరాని వేదనతో ఉంటే ఆ తల్లి వేదన వర్ణనాతీతం. గొప్ప చదువులు అభ్యసించి వృద్ధాప్యంలో తమకు తోడుగా ఉంటాడని ఆశించిన ఆ తల్లిని విధి వెక్కిరించింది. దిన దిన గండం నూరేళ్ల ఆయుష్షుగా మారుతున్న కొడుకు దీనస్థితిని చూసి తల్లడిల్లిపోతోంది. ఖరీదైన చికిత్సకు ఇప్పటికే ఉన్న ఆస్తినంతా పోగొట్టుకుంది. చివరకు చేతిలో చిల్లిగవ్వ లేక కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలని మానవతావాదులను వేడుకుంటోంది. - అనంతపురం కల్చరల్



నియాజ్‌కు సపర్యలు చేస్తున్న తల్లి జమీలా

- పాంక్రియాటైటిస్‌తో బాధపడుతున్న యువకుడు
- పేదరికం కారణంగా ఖరీదైన వైద్యానికి దూరం
- ఆపన్న హస్తం కోసం ఎదురు చూపు

దాతలు సంప్రదించాల్సిన చిరునామా

పేరు	: దూదేకుల నియాజ్
బ్యాంక్	: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఖాతా నంబర్	: 6246 792 6948
ఐఎఫ్ఎస్‌సీ కోడ్	: ఎస్‌బీఐ 0020575
మొబైల్ నంబర్	: 96183 18963

అనంతపురంలోని ఖాజానగర్‌కు చెందిన దూదేకుల బాబు, జమీలా దంపతులకు ఓ కుమా రుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నియాజ్‌కు ప్రస్తుతం 22 ఏళ్లు. తన ఎనిమిదవ ఏట నియాజ్ విపరీతమైన కడుపు నొప్పితో విలవిల్లాడాడు. ఆ సమయంలో తమకు తెలిసిన ప్రతి చోటా తీసుకెళ్లి తల్లిదండ్రులు వైద్యం చేయించారు. తల్లిదండ్రుల కష్టం చూసిన నియాజ్... ఎలాగైనా తాను ఉన్నత చదువులు అభ్యసించి, వారికి చేదోడుగా ఉం డాలని భావించాడు. ఇందులో భాగంగానే నొప్పిని భరిస్తూ పదో తరగతి పూర్తి చేశాడు. ఇంటర్ చదువుతున్న సమయంలో మరోసారి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులు హైదరాబా ద్‌లోని నిజామ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం పాంక్రియాటైటిస్‌తో బాధపడుతున్న ట్లుగా వైద్యులు నిర్ధారించారు. కొన్నాళ్లు అక్కడే ఉంచుకుని వైద్యం చేసి తాత్కాలిక ఉపశమనం కల్గించి, వెనక్కు పంపారు. కొన్ని నెలలకు మళ్లీ కడుపునొప్పి మొదలు కావడంతో కర్నూలులోని సర్వజనాస్పత్రితో చికిత్స చేయించారు. ఏ ఆస్ప త్రికి వెళ్లినా.. శస్త్రచికిత్సతో పాంక్రియాటైటిస్ లొం గదని, కేవలం మందులతోనే ఉపశమనం పొం దాల్సి ఉంటుందని వైద్యులు చెబుతూ వచ్చారు. మందులు ఆపేస్తే ప్రాణానికే ప్రమాదమని హెచ్చరించారు. అప్పటి నుంచి మందులతోనే కాలం నెట్టుకొచ్చారు. ఖరీదైన మందుల కొను గోలుకు ఉన్న ఆస్తి మొత్తం కర్పూరంలా కరిగిపో యింది. ప్రస్తుతం జీవనాధరం కోసం గౌరి థియే టర్‌కు వెళ్లేదారిలో జమీలా దోసెలు పోస్తోంది. ఈ వ్యాపారం ద్వారా వచ్చిన ఆదాయంలో ఎక్కువ భాగం కుమారుడి మందుల కొనుగోలుకే సరిపోతోంది. ఈ క్రమంలోనే రోజురోజుకూ కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతూ వచ్చింది. దీంతో కుమారుడికి అవసరమైన మం దుల కొనుగోలు భారమై ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తోంది.

ప్రాణభిక్ష పెట్టండి

అయ్యా! కొడుకును చూస్తూ బతకడం మాకే కష్టంగా ఉంది. ఇక కడుపునొప్పిని భరిస్తూ నియాజ్ ఎట్లుంటున్నాడో తలచుకుంటే కన్నీళ్లు ఆగడం లేదు. ఈ పరిస్థితుల్లోనూ అమ్మా నేను చదువుకుంటానంటుంటే కాదనలేకపోయా. ఓపెన్ డిగ్రీ కట్టించాను. విదేశాల్లో తప్ప సరైన వైద్యం ఇక్కడ అందుబాటులో లేదని పెద్ద డాక్టర్లే చెప్పేశారు. ప్రాణాలతో ఉండాలంటే ఖరీదైన మందులు వాడాలి. ఇందుకు నెలకు రూ.12 వేలు అవసరమవుతాయి. మా పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంటోంది. త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి సాయం అర్థించాలనుకుంటున్నాం. అంత వరకూ మా కుమారుడికి ప్రాణభిక్ష పెట్టండి. – జమీలా, నియాజ్ తల్లి, అనంతపురం